సాక్షి
అనకాపల్లి

శనివారం ¦ 18 ¦ నవంబర్ ¦ 2023



ఆర్జిత సేవలు పునరుద్ధరణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు.



ఘనంగా పంచరాత్రి ఉత్సవాలు

యలమంచిలిలో పంచరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున భారీ ఎత్తున జాతర జరిగింది. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు స్వల్పవర్షం కురుస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీఈఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 18, 19న 2, 20న 5, 21న 16, 22న 15 మి.మీ. చొప్పున వర్షపాతం, 33.6 నుంచి 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

నాణ్యతా ప్రమాణాలతో అనకాపల్లి అభివృద్ధి పనులు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



జోనల్ కార్యాలయంలో కమిషనర్ సాయికాంత్ వర్మ సమీక్ష

అనకాపల్లి టౌన్: జోనల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దిగువస్థాయి అధికారులు దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారిపై జలగల మదుం జంక్షన్ నుంచి శారదానది బ్రిడ్జి వరకు రహదారి అభివృద్ధి, సెంటర్ లైటింగ్, పాదచారులకు ఫుట్‌పాత్ తదితర పనులను నాణ్యత ప్రమాణాలతో జరిగేలా చూడాలని సూచించారు. నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్‌లు, బీటీరోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గుండాల జంక్షన్ వద్ద ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపం మరమ్మతు పనులపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు పట్టణంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన పర్యటనలో జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, జోనల్ పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహనరావు, ఈఈ చిరంజీవి, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావు, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, డీఈ శేఖర్, టీపీఎస్ జనార్దనరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రకాష్‌రావు

తుమ్మపాల: ఉద్యోగుల అర్జీలపై నిర్ణీత గడువులోగా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని జేసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.ప్రకాష్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురు ఉద్యోగుల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో ప్రతి మూడవ శుక్రవారం నిర్వహించే కార్యక్రమాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం నాలుగు అర్జీలు నమోదైనట్లు తెలిపారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుందని సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి గౌరవ సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు.

చక్కని ఆరోగ్యం.. బంగారు భవితవ్యం



ఈ బాలుడి పేరు సిహెచ్.మోహన్. కె.కోటపాడు హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు నెలలో పాఠశాలలో హెచ్‌బీ పరీక్ష చేసినప్పుడు 7.8 శాతం రక్తం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ప్రతి రోజూ వేయించారు. మూడు నెలలు పూర్తిగా మాత్రలు వాడిన తరువాత ఈ నెలలో మళ్లీ హెచ్‌బీ పరీక్ష చేసినప్పుడు 9 శాతం ఉన్నట్లు రిపోర్ట్ వచ్చింది. 12 శాతం హెచ్‌బీ వచ్చేంత వరకు పౌష్టికాహారంతోపాటు ఐరన్ మాత్రలను ఇస్తామని హెల్త్ అంబాసిడర్ చెప్పారు. గత మూడు నెలల కంటే ఆటలు ఆడే సమయాల్లో అలసట, ఆయాసం వంటి సమస్యలు ఇప్పుడు పెద్దగా లేవని మోహన్ చెప్పాడు.

- రక్తహీనత సమస్య నుంచి విద్యార్థులకు రక్షణ
- మూడు నెలలకోసారి పాఠశాలల్లో పరీక్షలు
- హెచ్‌బీ తక్కువున్న విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రల అందజేత
- హెల్త్ అంబాసిడర్ల పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు

జిల్లాలో 1,473 పాఠశాలల్లో హెల్త్ అంబాసిడర్లు

లక్షా 18 వేల 256 మంది విద్యార్థులకు మూడు నెలలకోసారి రక్తపరీక్షలు

కె.కోటపాడు: ఆరోగ్యం బాగుంటేనే చదువు ఒంటపడుతుంది. చిన్నారులు రేపటి పౌరులుగా ఎదుగుతారు. రాష్ట్రానికి, దేశానికి చక్కని భవిష్యత్తును అందిస్తారు. ఈ సదాశయంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే చర్యలను సర్కారు తీసుకుంటోంది. చిన్నారుల్లో ఇటీవల రక్తహీనత ప్రధాన సమస్యగా మారింది. తద్వారా జ్ఞాపకశక్తి తగ్గి చదువుల్లో చురుకుదనం లేకుండా పోతోంది. ఇటువంటి విద్యార్థుల ఆరోగ్య సమస్యకు పరిష్కారం చూపేలా విద్య, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు సంయుక్తంగా చర్యలను తీసుకుంటున్నారు.

ప్రతి మూడు నెలలకు హెచ్‌బీ పరీక్షలు

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు,రజూనియర్ కాలేజీల్లో 6 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి హిమోగ్లోబిన్ శాతాన్ని గుర్తించే పరీక్షలను చేయిస్తున్నారు. ఆగస్టు నెలలో జిల్లాలో గల 1473 పాఠశాలల్లో లక్షా 18 వేల 256 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో వైద్య సిబ్బంది పరీక్షలను చేశారు. వీరికి గల హెచ్‌బీ శాతాన్ని ఉపాధ్యాయులు నమోదు చేశారు. విద్యార్థులలో 7 శాతం కంటే హెచ్‌బీ తక్కువ ఉంటే సివియర్, 7 నుంచి 10 శాతం లోపు హెచ్‌బీ ఉంటే మోడరేట్, 10 నుంచి 11 శాతం ఉంటే మైల్డ్‌గా గుర్తించారు. విద్యార్థులలో 10 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం తరువాత రెండు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను, 10 నుంచి 19 ఏళ్ల మధ్య వారికి ఒక బ్లూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఇస్తున్నారు. మూడు నెలల తరువాత ఈ నెలలో ప్రస్తుతం హిమోగ్లోబిన్ శాతం ఎలా ఉందో పరీక్షలు చేస్తున్నారు. మూడు నెలల క్రితం నమోదు చేసిన హెచ్‌బీ శాతానికి ఇప్పుడున్న పరిస్థితికి బేరీజు వేసి, అవసరమైన వైద్య సహాయం అందిస్తారు.

హెల్త్ అంబాసిడర్‌గా పాఠశాలకో ఉపాధ్యాయుడు

పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడిని హెల్త్ అంబాసిడర్‌గా గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతోపాటు మధ్యాహ్న భోజనం పూర్తయిన తరువాత రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని వీరు పర్యవేక్షిస్తున్నారు. వీరికి విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణలో పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు తగిన సూచనలు అందిస్తారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం, వారానికి ఐదు రోజులపాటు గుడ్లు, బెల్లం చిక్కీలను ఆహారంగా ఇస్తున్నట్లు కె.కోటపాడు ఎంఈవో డి.వి.డి.ప్రసాద్ తెలిపారు.



చౌడువాడ హైస్కూల్లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులతో మాత్రలను వేయిస్తున్న ఉపాధ్యాయులు

విద్యుత్ సమస్యలకు రెండు నెలల్లోగా పరిష్కారం

- బాధితులకు న్యాయం జరిగేందుకు సీజీఆర్ఎఫ్ చక్కటి వేదిక
- చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ
- కశింకోట సమావేశంలో 333 అర్జీలకు మోక్షం

కశింకోట: విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా తమ సమస్యలను తెలిపితే రెండు నెలల్లోగా పరిష్కరించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. కశింకోటలోని ఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2005లో భారత్ విద్యుత్ చట్ట ప్రకారం ఈ న్యాయస్థానం ఏర్పడిందన్నారు. తప్పుడు విద్యుత్ బిల్లులు, బకాయి వసూలు, లోపం ఉన్న మీటరు, కాలిపోయిన మీటరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఓల్టేజీ హెచ్చు తగ్గులు, సర్వీసులో లోపం, కొత్త విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం, రీ కనెక్షన్లు ఇవ్వడం, కనెక్షన్ బదిలీ, మార్పు తదితర సమస్యలను వినియోగదారులు తమ దృష్టికి తీసుకు వస్తే సంబంధిత అధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలోని పూర్వ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సమస్యలను తమ న్యాయస్థానం పరిష్కరిస్తుందన్నారు.

333 సమస్యల పరిష్కారం

ఈ ఏడాది ఈపీడీసీఎల్ పరిధిలో 443 విద్యుత్ సమస్యలు తమకు అందాయని, వాటిలో 333 వినతులు పరిష్కరించామని చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ చెప్పారు. మరో 64 పాత కేసులు కూడా పరిష్కరించామన్నారు. ఇంకా 110 సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను వ్యక్తిగతంగా గాని, మెయిల్ ద్వారా గాని ఫిర్యాదు చేయాలన్నారు. ముందుగా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని, మీ సేవ ద్వారా గాని ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయస్థానం సభ్యులు ఎస్.హరిబాబు, వి.జనార్దనరావు, ఆర్.సురేంద్రకుమార్, ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, నోడల్ అధికారి టి.వెంకటేశ్వరరావు, పలువురు ఏఈలు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ

పలు సమస్యల నివేదన

- అగనంపూడి డెవలెప్‌మెంట్ కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ తమ గ్రామ పునరావాస కాలనీలో ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలో కండక్టర్ మార్పు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. అనకాపల్లి మండలం రాజుపేటలో లోఓల్టేజి నివారణకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను చైర్మన్ ఆదేశించారు.
- మునగపాక మండలం గంగదేవి పేటకు చెందిన ఆడారి శ్రీనివాసరావు తాను వ్యవసాయ మోటారు విద్యుత్‌కు పెండింగ్ బిల్లు ఆర్ఈసీఎస్‌గా ఉన్నప్పుడు రూ.1560 చెల్లించినప్పటికీ కనెక్షన్ పునరుద్ధరించలేదని ఫిర్యాదు చేశారు.
- ఈపీడీసీఎల్‌లోకి ఆర్ఈసీఎస్ విలీనం అయినందున మళ్లీ కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు.
- మునగపాక మండలం చూచుకొండ, పరవాడ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, మునగపాక మండలంలో వ్యవసాయానికి నిర్ణీత 7 గంటలు విద్యుత్ సరఫరా చేయడం లేదని రైతు నాయకుడు ఆళ్ల ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

వర్షాభావాన్ని తట్టుకునేలా..

- రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలి
- వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య తదితర శాఖలకు కలెక్టర్ ఆదేశం
- కరువు జిల్లాగా ప్రకటించాలని కోరిన వ్యవసాయ సలహా మండలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, పక్కన చిక్కాల రామారావు

తుమ్మపాల: జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుకు ఆదాయం వచ్చే విధంగా ఇతర వ్యవసాయ సంబంధిత మార్గాలను తెలియజేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయం, మత్స్య, ఉద్యానవన, బిందు సేద్యం, నీటిపారుదల శాఖలపై సమీక్షించారు. రైతులకు సబ్సిడీ లోన్లను అందించాలని, వ్యవసాయ సహకార బ్యాంకు అధికారులు రైతులకు ఇచ్చే రుణాలను గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. బోర్లు, నీటివనరులు ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలన్నారు. దాణాకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళిక తయారు చేయాలన్నారు. అదనపు ఆదాయాన్నిచ్చే పాడి, మత్స్య, ఉద్యానవన, కోళ్ల మేకల పెంపకం మొదలైన వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. బిందు సేద్యం తుంపర సేద్యం ద్వారా కాయగూరలను పండించడంపై మరింత మంది రైతులకు అవగాహన కలిగించి ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. ఈమేరకు సలహా మండలి సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పాడి, స్వల్పకాలిక పంటల ద్వారా రైతుకు సంబంధించిన మార్గాల ద్వారా ఆదాయాలు పొందే విధంగా వివిధ శాఖల అధికారులు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రసాద్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, డీసీసీబీ మేనేజర్ వర్మ, మత్స్య శాఖ అధికారి లక్ష్మణమూర్తి, పౌరసరఫరాల డీఎం జయంతి పాల్గొన్నారు



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి వేడుకలు శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. పాము పుట్టల వద్ద భక్తులు పాలు, కోడిగుడ్లు, తాటి గుజ్జు, నువ్వుల చిమిలి తదితర పదార్థాలను నాగేంద్రునికి నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి తారువలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల మండలం కె.జె.పురంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పూజలు చేశారు.

- దేవరాపల్లి/మాడుగుల రూరల్



హాట్‌కేకుల్లా అమ్ముడైన టీ-20 టికెట్లు



టీ-20 టికెట్ల కోసం బారులు తీరిన అభిమానులు..



మాకు టికెట్ దొరికిందోచ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈనెల 23న జరగనున్న భారత్–ఆస్ట్రేలియా టీ20 తొలి మ్యాచ్ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఇప్పటికే ఏసీఏ ఆధ్వర్యంలో పేటీఎం ద్వారా ఆన్‌లైన్ టికెట్ల విక్రయాన్ని ముగించగా శుక్రవారం ఐదు వేల టికెట్లను ఆరు డినామినేషన్లలో కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియంతో పాటు టౌన్ కొత్తరోడ్, గాజువాకల్లోని మున్సిపల్ స్టేడియాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి టికెట్లను విక్రయించారు. కనీస ధర రూ.600 నుంచి గరిష్ట ధర రూ.6000లో పాటు రూ.1500, రూ.2000,రూ.3000,రూ.3500లు టికెట్లను మూడు ప్రాంతాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయించారు. శుక్రవారం ఉదయం నుంచే ఆయా సెంటర్ల వద్ద అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టికెట్ల విక్రయాన్ని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి పరిశీలించారు. చక్కని ఏర్పాట్లు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పొందిన టికెట్లను స్టేడియంలో ప్రవేశానికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునేందుకు ఆయా సెంటర్లలోనే 22వ తేదీ వరకు అవకాశం కల్పించగా మ్యాచ్ జరిగే రోజు ఈనెల 23న స్టేడియంలోనూ టికెట్లను మార్చుకునేందుకు అవకాశం కల్పించామని గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో శనివారం సైతం ఆరు డినామినేషన్లలో టికెట్లను కౌంటర్ల ద్వారా విక్రయించనున్నామని తెలిపారు.

ప్రమాదాలు, గంజాయి రవాణా తగ్గుముఖం

- ఫలించిన ప్రత్యేక చర్యలు: డీఐజీ హరికృష్ణ
- కొత్తకోట స్టేషన్ సందర్శన



కొత్తకోట సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ

రావికమతం: కొత్తకోట సర్కిల్ కార్యాలయాన్ని డీఐజీ ఎస్.హరికృష్ణ శుక్రవారం సందర్శించారు. ఆయన వెంట అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఉన్నారు. ముందుగా సర్కిల్, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి అధికార్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల కారణంగా రోడ్డు ప్రమాదాలు, గంజాయి రవాణా గణనీయంగా తగ్గినట్టు చెప్పారు. గతేడాది తన పరిధిలో 46 శాతం రోడ్డు ప్రమాద మరణాలు చోటు చేసుకోగా ఈ ఏడాదికి 23 శాతానికి తగ్గించామన్నారు. గంజాయి వ్యాపారులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం, గంజాయి తోటల నిర్మూలన వంటి చర్యల వలన రవాణా గణనీయంగా తగ్గిందన్నారు. ఈ ప్రాంతం ఏజెన్సీకి ఆనుకుని ఉండటంతో నిఘా పెంచామన్నారు. నాటుసారా తయారీదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పిస్తూ సారా తయారీ నుంచి దూరం చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రధాన రహదారి అయిన బీఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో ఆలస్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, హిజ్రాలు మితిమీరి డబ్బులివ్వని వారిపై దాడులు చేస్తున్నారని తన దృష్టికి వచ్చినట్టు చెప్పారు. వాటిపై తగిన చర్యలకు ఆదేశాలిస్తామన్నారు. డీఐజీ పర్యటనలో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ రమణరావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పంచరాత్రి ఉత్సవాలు



భూలోకమాంబ అమ్మవారి సన్నిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్,ఆడారి ఆనంద్ కుమార్,బొడ్డేడ ప్రసాద్

- జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- భూలోకమాంబ,సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



జాతరలో జన సందోహం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి పట్టణంలో దీపావళి నుంచి నాగుల చవితి వరకూ ఐదు రోజుల పాటు జరిగిన పంచరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు శుక్రవారం జాతను భారీ ఎత్తున నిర్వహించారు. పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణంలోని పలు ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. తులసీనగర్‌లో వెలసిన భూలోకమాంబ, పాతవీధిలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామికి దీపావళి నుంచి నాగుల చవితి వరకూ ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ రెండు ఆలయాల్లో దర్శనాలకు భక్తుల క్యూ కట్టారు. శుక్రవారం నాగుల చవితి కావడంతో సుబ్రహ్మణ్యస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. భూలోకమాంబ అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చన చేశారు. శ్రీసూక్తం, దుర్గాసూక్తంతో పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

పంచరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లారమాకుమారి మంత్రి అమర్‌నాథ్‌కు సాదరంగా స్వాగతం పలికి, అమ్మవారి దర్శనాన్ని చేయించారు. దర్శనం అనంతరం శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

పోలీసు బందోబస్తు

పంచరాత్రి ఉత్సవాలు ముగింపు రోజు లక్షల సంఖ్యలో భక్తులు పలు ప్రాంతాల నుంచి యలమంచిలి వచ్చారు. శుక్రవారం రాత్రి 7 గంటల నుంచే జనం రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా మహిళలు, యువతులపై ఈవ్‌టీజింగ్ జరగకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. దొంగతనాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్‌ఐ భారీ ఎత్తున పోలీస్తు బందోబస్తు నిర్వహించారు.ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని శుక్రవారం మధ్యాహ్నం నుంచి యలమంచిలి పట్టణంలోకి వచ్చే వాహనాలను వేరే దారిలో మళ్లించారు.

శేష జీవితమంతా అద్వైత చింతనతోనే..

- హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక అధ్యయన కేంద్రం
- వచ్చే ఏడాది నుంచి అక్కడి నుంచే అద్వైత సేవలు
- విశాఖలో ఇదే నా చివరి జన్మదినోత్సవం
- శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ కీలక ప్రకటన



స్వామీజీతో ముచ్చటిస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్

పెందుర్తి : జన్మదినోత్సవం వేళ విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో 30 ఏళ్ల పాటు ఆధ్యాత్మిక సేవలందించిన స్వామీజీ శేష జీవితాన్ని హైదరాబాద్‌లోని కోకాపేటలో నిర్మించనున్న ఆధ్యాత్మిక అధ్యయన కేంద్రంలో గడిపేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది నుంచి ఆ అధ్యయన కేంద్రంలోనే ఉంటూ ఆదిశంకరుల అద్వైత తత్వంపై పరిశోధనలు చేపడతామన్నారు. విశాఖలో ఇదే ఆఖరి జన్మదినోత్సవం అని..రానున్న జన్మదినోత్సవాలు అక్కడే జరుపుకుంటానని స్పష్టం చేశారు. విశాఖ శ్రీశారదాపీఠంలో శుక్రవారం జన్మదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ గురువు (స్వామిజీ)కి పాదపూజ చేసి భిక్షావందనం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తూ తాను సన్యాసం స్వీకరించి 30 ఏళ్లు పూర్తయిందని..తెలుగునాట కీర్తి కాంక్ష లేకుండా శంకరాచార్య సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆధ్యాత్మిక విప్లవాన్ని సృష్టించేలా శ్రీశారదాపీఠాన్ని తీర్చిదిద్దామన్నారు. ఆదిశంకరుల అద్వైత తత్వంపై విదేశాల్లో సైతం అధ్యయనం చేసేందుకు వీలుగా హైదరాబాద్ కోకాపేటలో రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. విశాఖ శ్రీశారదాపీఠం బాధ్యతలు వచ్చే ఏడాది జన్మదినోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీకి అప్పగిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది షష్టిపూర్తి కార్యక్రమం అధ్యయన కేంద్రంలోనే చేసుకుంటానని పేర్కొన్నారు.



స్వామీజీకి ఫలాలు సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా పీఠం విశేష ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శుక్రవారం ఉదయం నుంచి స్వామీజీ పేరిట అవహంతి, ఆయుష్య హోమాలను నిర్వహించారు. పీఠం ఆస్థాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు సహా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం స్వామీజీ చేతుల మీదుగా నిరుపేదలకు వస్త్రదానం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి స్వామీజీని కలిసి ఆశీసులు తీసుకున్నారు. టీటీడీ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహచలం, కాణిపాకం, అరసవిల్లి, మహానంది, అహోబిలం, యాగంటి, గండి, కనకదుర్గ, కనకమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానాల నుంచి ఉన్నతాధికారులు, అర్చకులు తరలివచ్చి స్వామీజీకి పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, భారత క్రికెట్ జట్టు ఆటగాడు కె.ఎస్ భరత్, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, బియ్యపు మధుసూధన్‌రెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పర్వత పూర్ణచంద్రప్రసాద్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్, శెట్టి పాల్గుణ, గణబాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్, కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, యానాం మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వామీజీ ఆశీసులు అందుకున్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

తుమ్మపాల: జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేనిదే సెలవుపై వెళ్లకూడదన్నారు. కేటాయించిన పనిని నిర్ణయించిన గడువులోగా తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారి వీరు నాయుడు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

‘టీడీపీకి రాజకీయ సమాధి ఖాయం’



ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: రాబోయే ఎన్నికల్లో టీడీపీని రాజకీయంగా సమాధి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు తరిమి కొట్టారని చెప్పారు. ఈ సారి ఏకంగా సమాధి చేయడం ఖాయమన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. నాడు-నేడు, అమ్మ ఒడి పథకాలపై అయ్యన్నపాత్రుడు చేసిన ఆరోపణలను ఖండించారు. తెలుగుదేశం హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉండేవో..సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏవిధంగా ఉన్నాయో అయ్యన్నపాత్రుడు కళ్లు పెట్టి చూడాలని హితవు పలికారు. చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో 232 పాఠశాలలు ఉంటే మొదటి విడతలో 89 పాఠశాలలు, రెండవవిడతలో 103 పాఠశాలలను రూ.73 కోట్లతో ఆధునికీకరించామన్నారు. అమ్మఒడి పథకం కింద నాలుగు దఫాల్లో నియోజకవర్గంలో 27 వేల మందికి తల్లుల ఖాతాల్లో రూ.169 కోట్లు జమచేశామని చెప్పారు. చంద్రబాబు పేరు చెబితే స్కామ్ లు గుర్తొస్తాయని, జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే స్కీమ్‌లు గుర్తొస్తున్నాయని తెలిపారు. అయ్యన్నపాత్రుడు ఎన్నో అక్రమాలు చేశారన్నారు. రంగురాళ్ల తవ్వకాలు, లేటరైట్, ఇసుక, లిక్కర్‌లో కోట్లరూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వేడుకగా ‘సుందర్ స్కైలాంజ్’ బ్రోచర్ ఆవిష్కరణ



మధురవాడలో వైశాఖీ వెంచర్ సుందర్ స్కైలాంజ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, తదితరులు

మధురవాడ: ప్రముఖ గృహ నిర్మాణ సంస్థ వైశాఖీ నూతన వెంచర్ ‘సుందర్ స్కైలాంజ్’ బ్రోచర్‌ను మధురవాడ రెవెన్యూ కాలనీలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వీడియోను రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ఆవిష్కరించారు. నిర్మాణ సంస్థకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైశాఖీ సంస్థ అధిపతులు బలుసు విద్యాసాగర్, బలుసు రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు 30 అంతస్తుల్లో గేటెడ్ కమ్యూనిటీగా చేపడుతున్నామన్నారు.

మునుపెన్నడూ లేనివిధంగా ఒక కొత్త డిజైన్, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో దళిత యువకునిపై దాడి

- తీవ్ర గాయాలు... కేజీహెచ్‌కు తరలింపు



తీవ్ర గాయాలపాలైన కన్నయ్య, విచారణ చేస్తున్న అనకాపల్లి అట్రాసిటీ డీఎస్పీ సుబ్బరాజు

రావికమతం: పాతకక్షల నేపథ్యంలో మత్రివలస గ్రామంలో మిత్రుల మధ్య గురువారం రాత్రి తీవ్ర వివాదం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన దళిత యువకుడు వారా కన్నయ్యపై పాత మిత్రుడు తమ్మిరెడ్డి వంశీతో పాటు ముగ్గురు తీవ్రంగా కొట్టి, కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో కన్నయ్యకు తీవ్ర గాయాలవడంతో నర్సీపట్నం ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. కన్నయ్య సోదరుడు నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మత్రివలస గ్రామానికి చెందిన కన్నయ్య, వంశీ గతంలో మిత్రులు. కొన్నాళ్ల క్రితం ఇద్దరి మధ్య వివాదాలు చోటు చేసుకున్నా యి. ఈ కారణంగా కన్నయ్య బొడ్డేపల్లి గ్రామానికి కూలి పనుల నిమిత్తం వలస వెళ్లాడు. నాగుల చవితి పండుగ సందర్భంగా గురువారం గ్రామానికి వచ్చిన కన్నయ్య, వంశీకి మధ్య మళ్లీ వివాదం తలెత్తింది. దీంతో వంశీ, మరో ముగ్గురు కన్నయ్య ఇంటికి వెళ్లి కత్తితో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులోఉన్న కన్నయ్యను బంధువులు నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. కన్నయ్య సోదరుడు నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. అనకాపల్లి అట్రాసిటీ డీఎస్పీ సుబ్బరాజు శుక్రవారం రాత్రి ఆ గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు.

తోడపెద్దు దాడిలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం

కోటవురట్ల: తోడపెద్దు పొడవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలాఉన్నాయి. కోటవురట్లకు చెందిన జవ్వాది ప్రకాష్ (56) బైక్‌పై నర్సీపట్నం వెళ్లి తిరిగి కోటవురట్ల వస్తుండగా యండపల్లి శివారున ఎదురుగా వస్తున్న తోడపెద్దును పొరపాటున ఢీకొన్నాడు. దీంతో ఆగ్రహించిన తోడపెద్దు ప్రకాష్‌ను పొడిచి తీవ్రంగా గాయపరిచింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసునమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రాము, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పండగ పూట చోటుచేసుకున్న దారుణ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పవర్ లిఫ్టింగ్ పోటీలు నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు శనివారం జరగనున్నాయి. పోటీలను అనకాపల్లి పార్క్ జంక్షన్, గౌరీ సేవా సంఘం ఆవరణలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.వి. నాగేశ్వరరావు తెలిపారు. మూడు జిల్లాల నుంచి ఎంపికైన జట్లు ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు హాజరుకావాలని, అర్హత పత్రాలకూడా తీసుకురావాలని ఆయన కోరారు.

కొత్త ఏడాదిలో.. అదనపు కానుక

- వచ్చే జనవరి నుంచి రూ.3 వేల పింఛన్
- సీఎం జగన్ ప్రకటనతో ఆనందంలో లబ్ధిదారులు
- మండలంలోని 12,477 మంది పింఛన్‌దారులకు లబ్ధి

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ ఏటా పింఛన్ కానుక మొత్తాన్ని పెంచుకుంటూ వస్తున్నారు. జనవరి నుంచి పింఛన్ కానుక మరో రూ.250 పెరగనుంది. కొత్త ఏడాదిలో పింఛన్ లబ్ధిదారులు రూ.3 వేలు అందుకోనున్నారు. దీంతో మండలంలోని లబ్ధిదారులంతా జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి రూరల్: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వైఎస్ జగన్ సర్కార్ నూతన సంవత్సర కానుక అందిస్తోంది. వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో ప్రతి నెలా ఠంచనుగా ప్రభుత్వం రూ.2,750 అందిస్తోంది. వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి ఒక్కొక్కరికి మరో రూ.250 పెంచుతోంది. దీంతో జనవరి నెలలో వీరంతా రూ.3 వేల పింఛన్ అందుకోనున్నారు.

మండలంలో 12,477 మందికి లబ్ధి

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వివరాలన్నీ పరిశీలించి అర్హులకు పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే గత సెప్టెంబర్ నెలలో రెండు విడతల్లో మండలంలోని 337 మందికి కొత్త పింఛన్‌లు మంజూరు చేశారు. దీంతో ప్రస్తుతం మండలంలో 12,447 మందికి ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తోంది. ఇందు కోసం ప్రతి నెలా సుమారు రూ.3.74 కోట్లు నగదు విడుదల చేస్తోంది. ఇక జనవరి నుంచి ప్రభుత్వం రూ.250 పెంచనుండడంతో మండలంలోని లబ్ధిదారులకు ప్రతి నెలా దాదాపు రూ.30 లక్షలకు పైగా అదనపు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం రూ.2750 పింఛన్ అందుకుంటున్న వారందరికీ ఈ లబ్ధి చేకూరనుంది.


మార్టూరులో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

ఆహా ఒకటో తారీఖు

గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు అమ్మో ఒకటో తారీఖు అనుకునేవారు. ఎక్కడ పింఛన్ ఇస్తున్నారో తెలియక వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర అవస్థలు పడేవారు. పింఛన్ సొమ్ము కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కేవలం పచ్చ చొక్కావారికి, వారి సానుభూతిపరులకు మాత్రమే లబ్ధి చేకూర్చేందుకు ప్రాధాన్యతనిచ్చేవారు. అసలు పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఉన్నాడో? లేడో? తెలుసుకోవడానికే తిప్పలు పడాల్సి వచ్చేది. సెక్రటరీ వస్తారంటే తెల్లవారుజాము నుంచి పనులన్నీ విడిచిపెట్టి క్యూలో పింఛన్ పుస్తకం పెట్టి కాసుక్కూర్చునేవారు. అది కూడా కేవలం రూ.వెయ్యి మాత్రమే. తీరా ఎన్నికల ముందు మరో రూ.వెయ్యి పెంచి, ఒక నెల మాత్రమే ఇచ్చి ఎన్నికలకు వెళ్లారు. సీఎం జగన్ పాలనలో ఆహా ఒకటో తారీఖు అనుకునేలా ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీనే పింఛన్ అందుకుంటున్నారు. తెల్లవారుజామునే గడప దాటాల్సిన పనిలేకుండా వలంటీర్లే వచ్చి, పింఛన్ నగదు అందించి వెళ్తున్నారు.


విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకి పింఛన్ అందిస్తున్న వలంటీర్

చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్ ఏదైనా చెబితే తప్పకుండా చేస్తారనే నమ్మకం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. చెప్పనివి కూడా పేద ప్రజల కోసం ఎన్నో చేశారు. పింఛన్ మొత్తం చెప్పినట్లే పెంచుకుంటూ వెళ్లారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ ఇస్తానన్నారు. జనమంతా మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నారు.

– తాడి మణి, సత్యనారాయణపురం

జగన్ మా పెద్ద కొడుకు



సీఎం జగన్ వయసుడిగిన మమ్మల్ని పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. మాలాంటి వారిలో కొందరికి కుటుంబంలో కాస్తయినా ఆదరణ ఉందంటే వారికొచ్చే పింఛనే కారణం. జగన్‌బాబు మాటిస్తే మడమ తిప్పడు. ఆ బాబు నూరేళ్లు చల్లగా ఉండాలి. మాలాంటి వారిని మరింత ఆదుకోవాలి. మా ఆశీస్సులెప్పుడూ జగన్‌పైనే.

– మంత్రి వెంకయ్యమ్మ, మార్టూరు

కొత్త ఏడాది మరింత భరోసా



ప్రతి నెలా మా ఇంటికే వచ్చి పింఛను అందిస్తున్నారు. గతంలో పింఛను తీసుకోవాలంటే ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. నాలాంటి ఎంతో మందికి వైఎస్సార్ పింఛన్ కానుక గౌరవంగా జీవించేలా చేస్తోంది. లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి జగన్‌కు ఎంతగానో రుణపడి ఉంటారు. మా జీవితాలకు సీఎం జగన్ రూపంలో ఆర్థిక ధీమా దక్కింది.

– ఉగ్గిన నూకరత్నం, సత్యనారాయణపురం

క్లుప్తంగా

అయ్యప్ప నిత్యాన్నదానానికి రైతు సంఘం వితరణ


గౌరీ సంఘం సభ్యులకు బియ్యం బస్తాలు అందిస్తున్న రైతు సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ సంఘం అయ్యప్పస్వామి ఆశ్రమంలో అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం చేస్తున్న సంఘ సభ్యులకు రైతు సంఘం ఆశ్రమం తరఫున 30 బియ్యం బస్తాలు, 5 నూనె డబ్బాలు, కొంత నగదు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధులు కొణతాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఏటా ఆశ్రమంలో ఉన్న స్వాములకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు మళ్ల సురేంద్ర, పీలా రాముడు, సూరిబాబు, కొణతాల పండు, పీలా శ్యామ్, పురుషోత్తం, విల్లూరి హరి పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం


సత్కారం పొందిన కవులతో గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ సమ్మేళనానికి సాహితీ మిత్రుల కన్వీనర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి సహచర మిత్రులకు స్వాగతం పలికి గ్రంథాలయాలు–సాహిత్యంపై ప్రసంగించారు. కథా రచయిత గొంతిన రంగబాబు నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు పుస్తకాలు, గ్రంథాలయాలు తదితర అంశాలపై కవితలు– పాటలు వినిపించి, ఆకట్టుకున్నారు. కవులు, కవయిత్రులు రాయవరపు సరస్వతి, రేగురగడ్డ వెంకటలక్ష్మీగాయత్రి, జీఎస్‌కే సాయిబాబా, కర్రి మల్లీశ్వరి, బుద్ధ వీరునాయుడు, ఎం.ధర్మారావు, వజ్రపు త్రినాథరావు, కోరాడ అప్పలరాజులను గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సమన్వయకర్త బల్లా నాగభూషణం, సభ్యులు ఎల్‌వీ రమణ, బీవీ రామఅప్పారావు, రామారావు, భరణి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: దళాయిపాలెంలోని ఎమ్మెల్యే అతిథి గృహంలో శనివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అధ్యక్షతన మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రపై పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సన్యాసిరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోన కోరారు.

అనకాపల్లి సినిమాలు

మై నేమ్ ఈజ్ శృతి	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 15 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 285 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 194 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నేటి నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు ఈ నెల 23 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి సూరి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గవరపాలెం నిదానందొడ్డి బాబా మందిరంలో 23వ వరకు రోజువారీ వివిధ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

➡ 18న ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం.
➡ 19న విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ సత్యసాయి మహిళా దినోత్సవం సందర్భంగా పేదలకు చీరలు, దుప్పట్లు, అమృత కలశాల పంపిణీ, సాయంత్రం నామసంకీర్తన, గిరిజా స్పందన సహకారంతో సిరిసంపద నృత్యం వారిచే కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన.
➡ 20న శివ స్తోత్ర పారాయణం, వివిధ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు.
➡ 21న హనుమాన్ చాలీసా పారాయణం, సత్యసాయి పల్లకీ సేవ, మహానగర సంకీర్తన, కోలాటాలతో ఊరేగింపు.
➡ 22న సత్యసాయి వ్రతాలు, రాత్రి 7 గంటలకు నామసంకీర్తన.
➡ 23న షిర్డీసాయి చాలీసా పారాయణం, సత్యసాయి రుద్రాభిషేకం, అన్నసమారాధన, సాయంత్రం నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ, సత్యసాయి జయంతి పురస్కరించుకుని కేక్ కటింగ్, స్వామివారి ఊంజల్‌సేవ, మంగళహారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఘనంగా నాగదుర్గమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


అమ్మవారి పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో వేంచేసిన నాగదుర్గమ్మ జాతర మహోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పుట్టకు పూజలు చేసి, పాలు పోశారు. అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నేల వేషాలు, రాత్రి 7 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుద్ధ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలమరశెట్టి బుజ్జి, కోశాధికారి దాడి పరదేశినాయుడు, ఆలయ అర్చకులు కొడుకుల శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


కశింకోట గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు


తాళ్లపాలెం గ్రంథాలయంలో చదరంగం పోటీలు

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఎంఈవో నంబా రమణ, విశ్రాంత టీచర్ యల్లపు రామచంద్రరావు, గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తిగేయాలు, చదరంగం పోటీలను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

వ్యక్తి ఆత్మహత్య

పరవాడ: మద్యానికి బానిస కావడంతో పాటు అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన డి.జోగారావు(42)గా పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన జోగారావు పదేళ్ల నుంచి ఎన్టీపీసీలో లేబర్‌గా పనిచేస్తూ వెన్నలపాలెంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన జోగారావు తెలిసిన వారందరి వద్ద రూ.6 లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు తీర్చాలని వారు ఇటీవల జోగారావుపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పు తీర్చకపోవడంతో అతని ద్విచక్ర వాహనం కూడా పట్టుకుపోయారు. దీంతో జోగారావు మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. రెండు రోజులుగా ఇంటి వద్ద జోగారావు కనిపించకపోవడంతోయజమాని శుక్రవారం సాయంత్రం కిటికిలోంచి లోపలికి చూశాడు. జోగారావు గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పరవాడ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ మల్లేశ్వరరావు జోగారావు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య ముగ్గురు సంతానం. భార్యా పిల్లలు ఇచ్ఛాపురంలోఉంటున్నారు.


మృతి చెందిన జోగారావు

స్వరూపానందేంద్రునికి జన్మదిన శుభాకాంక్షలు



శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ జన్మదినం సందర్భంగా పెందుర్తి, చినముషిడివాడలోని పీఠంలో స్వామివారిని ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు దర్శించుకున్నారు. స్వామి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు పొందారు.

– అనకాపల్లి టౌన్

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

కశింకోట: స్థానిక గవరపేట కనక మహాలక్ష్మి వీధిలో శుక్రవారం రాత్రి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. నాగుల చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీలో జిల్లా నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఉత్సవ కమిటీ చైర్మన్ బీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసిరావు, కోశాధికారి ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలాడుతున్న ఐదుగురి అరెస్టు

కశింకోట: మండలంలోని పాతకన్నూరుపాలెంలో కోడిపందేలాడుతున్న శిబిరంపై శుక్రవారం దాడి చేసి ఐదుగుర్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నగదు పణంగా పెట్టి ఆడుతుండగా వీరిని అరెస్టు చేశామన్నారు. ఆరు పందెం కోళ్లతోపాటు, రూ.1,820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాహి పాహి నాగదేవ దయామయ

పాహి పాహి సర్పరూప నాగదేవ దయామయ.. సత్సంతాన సంపత్తిం దేహిమే శంకర ప్రియ! అనంతాది మహానాగ రూపాయ వరదాయచ తుభ్యం.. నమామి భుజగేంద్ర సౌభాగ్యం దేహిమే సదా!! అంటూ శుక్రవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు నాగేంద్రుడిని భక్తిప్రపత్తులతో కొలిచారు.


పూడిమడక రహదారిలో పుట్టవద్ద పూజలు చేస్తున్న ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు

అనకాపల్లిటౌన్: నాగేంద్రా.. మేము, మా వంశం నిన్ను ఆరాధిస్తున్నాం. పొరపాటున నిను తొక్కితే తొలగిపో. నడుంపై కాలు పడితే నీ వాడేననుకో. పడగపై కాలేస్తే కస్సుబుస్సుమని మమ్మల్ని భయపెట్టకు తండ్రీ.. అంటూ ఊరూవాడా పుట్టల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. పట్టణ, మండలంలో ప్రజలు నాగుల చవితి పండగను ఘనంగా నిర్వహించారు. కుటుంబసమేతంగా పుట్టల వద్దకు చేరుకుని పుట్టలో పాలు, గుడ్లు వేసి, చిమిలి, పళ్లు, కొబ్బరికాయలు, తేగలు నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాల్చి స్వామిని ఆహ్వానించారు.

➡ స్థానిక పూడిమడక రహదారిలోని తమ వ్యవసాయ క్షేత్రంలో ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు నాగుల చవితి పూజలు జరిపారు.
➡ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు మండలంలోని రేబాక గ్రామంలో ఉన్న తమ వ్యవసాయ క్షేత్రంలో పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజించారు.
➡ డైట్ కళాశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు కుటుంబ సమేతంగా నాగేంద్రుడికి పూజలు చేశారు.
➡ పట్టణంలో రాణిగారి పూలతోట, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు, శారదానది గట్టు, ప్రేమసమాజం, గాంధీనగరం, అంజయ్యకాలనీ ప్రాంతాల్లో పట్టణవాసులు పుట్టల వద్దకు చేరుకుని నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
➡ మండలంలో రేబాక, తుమ్మపాల, కొత్తూరు, శారదానగర్, అక్కిరెడ్డిపాలెం, పాపయ్యసంతపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, వల్లూరు, రాజుపాలెం, మారేడుపూడి, కొప్పాక గ్రామాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు జరిపారు.

అనకాపల్లి రూరల్: మండల గ్రామీణ ప్రాంతంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు పిల్లలతో కలిసి సర్పదోష నివారణకు నాగేంద్రుడిని ఆరాధించారు. పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీలో పలువురు కాలనీ వాసులు మూకుమ్మడిగా నాగుల చవితి వేడుకలు నిర్వహించారు. తుమ్మపాల, కొత్తూరు మేజర్ పంచాయతీలతో పాటు గ్రామాల్లో చవితి సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ఆలయాల వద్ద కోలాట ప్రదర్శనలు జరిగాయి. పట్టణానికి సమీపంలో రాణీగారి తోటలో సిద్ధార్థ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కుటుంబ సభ్యులతో కలిసి చవితి పూజలు చేశారు.


రేబాకలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు


రాణిగారిపూలతోట వద్ద పామును ఆడిస్తున్న దృశ్యం

కశింకోట: మండల ప్రజలు రెండో రోజు శుక్రవారం కూడా నాగుల చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరిపారు. స్థానిక గాడివీధి నాగేంద్రస్వామి ఆలయంలో స్వామిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని కోడిగుడ్లు, చిమిలి తదితర పూజా ద్రవ్యాలను పుట్టలో వేసి, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు తిమ్మాపతిన సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కోలాటాలు, తోడపెద్దు సేవ నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మరోవైపు ప్రజలు పొలాల్లోను, గట్ల వద్దకు వెళ్లి పుట్టల వద్ద పూజలు చేసి, పుట్ట రంధ్రాల్లో సంప్రదాయంగా కోడిగుడ్లు, పాలు వేసి, నాగేంద్రుడిని ఆరాధించారు. కశింకోట పొలాల్లో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి, కన్నూరుపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు నాగుల చవితి వేడుకల్లో పాల్గొన్నారు.


డైట్ కళాశాల ఆవరణలో పుట్టలో పాలుపోస్తున్న దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులు


రాణిగారిపూలతోట వద్ద పుట్టలకు పూజలు చేస్తున్న మహిళాభక్తులు


రాణీగారి తోటలో కుటుంబ సభ్యులతో బల్లా నాగభూషణం


రాణిగారిపూలతోట వద్ద గుంపులు గుంపులుగా ఉన్న జనం


బీఆర్టీ కాలనీలో పుట్ట వద్ద పూజల్లో పాల్గొన్న కాలనీ వాసులు


తాళ్లపాలెంలో పుట్టల వద్ద నాగుల చవితి వేడుకలు


కశింకోట పొలాల్లో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి


కశింకోట గాడివీధి నాగేంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కుష్టురహిత సమాజానికి కృషి


మాట్లాడుతున్న వైద్యాధికారి విమలగిరి

మునగపాక: కుష్టురహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టువ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. అపోహలు లేకుండా వ్యాధి గ్రస్తులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ఎవరికైనా ఐదులోపు మచ్చలుంటే ఆరు నెలలు, అయిదు కన్నా ఎక్కువ మచ్చలుంటే సంవత్సరం పాటు మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. స్పర్శలేని రాగి రంగులో మచ్చలుంటే ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించాలని తెలిపారు. సీహెచ్‌వో దేవకాంత,ఆరోగ్య పర్యవేక్షకులు వీఎస్ఎం లక్ష్మి, ఎం.ఉమామహేష్, ,ఎంఎల్‌హెచ్‌పీ యామిని ప్రియ, ఏఎన్ఎం శ్రీ రమణ,హెల్త్ ఆఫీసర్ విశ్వనాథం, ఆశ కార్యకర్తలు రూప.పద్మావతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.